క్లుప్తంగా

పరీక్షలంటే భయం వీడాలి



పదో తరగతి మోడల్ ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న ఎస్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు

ఉరవకొండ: పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని వీడాలని ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి మోడల్ పరీక్షలు నిర్వహించారు. ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి చందు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పదో తరగతి మోడల్ ప్రశ్నపత్రాలను ఎస్‌ఐతో కలిసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనమంతరాయుడు, కుళ్లాయిస్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి అంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు మంజునాథ్, కార్యదర్శి వెంకట్ నాయక్, రాజేష్, రాజు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

హజరత్ సయ్యద్ జాఫర్ షావలి ఉరుసు



పూజలందుకున్న జాఫర్‌షా వలి దివ్య సమాధి

రాయదుర్గంటౌన్: పట్టణ సమీపంలోని కొండపై వెలసిన హజరత్ సయ్యద్ జాఫర్ షా వలి దర్గా ఉరుసు ఆదివారం నుంచి ప్రారంభమైంది. హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీక అయిన ఉరుసును భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ నెల 19 వరకు ఉరుసు జరుగుతుందని దర్గా కమిటీ, యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. తొలిరోజు గంధం ఉత్సవాన్ని నిర్వహించారు. 17న ఉరుసు ఉత్సవం, 18న షంషీర్ ఉత్సవం, 19న జియారత్ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన గంగాధర్, శేఖర్

రాయదుర్గంటౌన్: పట్టణ శివారులోని పైతోట వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గుమ్మఘట్ట మండలం పులకుంటకు చెందిన గంగాధర్, శేఖర్‌కు గాయాలయ్యాయి. వీరిద్దరు ట్యాటూ వేయించుకునేందుకు కర్ణాటకలోని మొలకాల్మూరుకు వెళ్లారు. తిరుగుప్రయాణంలో పట్టణంలోని పైతోట సమీపంలో ప్రమాదానికి గురయ్యారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ



రైతులకు సబ్సిడీ డ్రిప్ పరికరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గంటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రైతులకు సూక్ష్మనీటి సాగు పథకం కింద ఏపీఎంఐపీ ద్వారా రాయితీతో మంజూరైన డ్రిప్, స్ప్రింక్లర్లను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదివారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలో అర్హులైన 223 మందికి రూ.2.25 కోట్ల విలువైన సబ్సిడీ డ్రిప్ పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ అసిస్టెంట్ పీడీ ఫిరోజ్‌ఖాన్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల కోసం చదవాలి



నైట్ విజిట్ చేసి ఆరా తీస్తున్న ప్రిన్సిపాల్ ఆంజనేయులు

కణేకల్లు: మెరుగైన ఫలితాల కోసం కష్టపడి చదవాలని ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపాల్ ఆంజనేయులు విద్యార్థులకు సూచించారు. మండలంలోని కళేకుర్తి, మాల్యం, కణేకల్లుకు చెందిన విద్యార్థుల ఇళ్లకు ప్రిన్సిపాల్ వెళ్లారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి పిల్లలు ఎలా చదువుతున్నారని ఆరాతీశారు. మార్చి 1వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని, సమయం తక్కువ ఉన్నందున పిల్లలు బాగా చదివేలా చూడాలన్నారు.

సారూ..సమస్యలు పట్టించుకోరూ..!

- 'దుర్గం'లో కాలుష్య కాటు
- డంపింగ్ యార్డుతో భరించలేని దుర్వాసన
- ముంపు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య
- పలు కాలనీల్లో తాగునీటికి కటకట
- ఆదుకోవాలంటున్న రాయదుర్గం వాసులు



డంపింగ్ యార్డు

రాయదుర్గంలో పెద్ద సారుకు సమస్యలు స్వాగతం పలకనున్నాయి. పట్టణంలోని గత కొంత కాలంగా డంపింగ్ యార్డు సమస్య ప్రజలను వేధిస్తోంది. ఊరికి దూరంగా కొండ పోరంబోకు వద్ద స్థల పరిశీలన చేస్తున్నా.. అది కార్యరూపం దాల్చలేదు. దీంతో డంప్‌యార్డు పొగ పట్టణ ప్రజలను కమ్మేస్తోంది. యార్డులో గుట్టల కొద్దీ పేరుకుపోయిన చెత్త దుర్వాసన వస్తుండడంతో ప్రజలు భరించలేకపోతున్నారు.ముంపు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య అధికంగా ఉంది. పలు కాలనీల్లో తాగునీటికి కటకట ఉంది. సోమవారం పట్టణంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరయ్యే జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు స్వాగతం పలకనున్నాయి. వాటి పరిష్కరించాలని, పట్టణ ప్రగతికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– రాయదుర్గం:

పురపాలక సంఘం పరిధిలోని 75 వేల మంది జనాభా ఉండగా కొన్ని శివారు కాలనీల్లో వేసవికి ముందే తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. దీనికి ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా డ్రైనేజీ సౌకర్యం లేక వర్షం వస్తే చాలు మంపుకాలనీల్లోని ఇళ్లన్నీ నీటితో నిండిపోతున్నాయి. డ్రైనేజీ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులు రాబట్టి ఈ వేసవిలోనే పనులు ప్రారంభిస్తే వర్షాకాలంలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపొచ్చు. వీధి లైట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు కృషి చేయాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

అక్రమార్కుల భరతం పట్టాలి..

పట్టణ పరిసరాల్లో ఏర్పాటైన ఇందిరమ్మ కాలనీల్లో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు పెరిగిపోయాయి. ఆఖరుకు రిజర్వు స్థలాలు సైతం కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయి. రెండు రోజుల క్రితం మల్లాపురం లేఔట్‌లో జేసీబీలతో కొందరు అక్రమార్కులు ప్లాట్లు కొల్లగొట్టారు. అధికారులు చెప్పినా కబ్జాలు ఆపడం లేదు. గౌడ, బీటీపీ లేఔట్‌లలో పూర్వ లబ్ధిదారుల స్థానాల్లో కొత్తగా (తహసీల్దార్) ఫోర్జరీ సంతకాలతో పట్టాలు సృష్టించి, చాలా మంది ఆక్రమణలకు పాల్పడ్డారు. వారిపై చర్యలు చేపట్టడంతో పాటు లబ్ధిదారులకు న్యాయం చేయాల్సి ఉంది.ఫోర్జరీపై ఆరా తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణ వాసులు కోరుతున్నారు. జగనన్న కాలనీల్లో పట్టాలు పొందిన లబ్ధిదారులపై జరుపుతున్న విచారణ న్యాయబద్ధంగా ఉండేలా చూడాలని కోరుతున్నారు.

పల్లెలకు నడవని బస్సు సర్వీసులు..

గ్రామీణ ప్రాంతాలకు సరిపడా పల్లె వెలుగులు నడపడం లేదు. ఆర్టీసీలో డొక్కు బస్సులతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత్యంతరం లేక ఆటోల్లో వెళ్తూ ప్రమాదాల భారిన పడుతున్నారు. ప్రయాణికులకు సరిపడా బస్సు సర్వీసులు నడిపేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. అలాగే ఇసుక, మట్టి అక్రమ రవాణా దారులపై ఉక్కుపాదం మోపాలి.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



రాయదుర్గానికి విచ్చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయాలి. పట్టణం, పల్లెల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి. తగిన నిధులు కేటాయించాలి. ఫ్రీహోల్డ్ భూముల సమస్యకు ముగింపు పలకాలి. డంపింగ్ యార్డుకు స్థల సేకరణ పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి.

– మేకల శ్రీనివాసులు, పట్టణ వాసి, రాయదుర్గం

మైలారలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో కొలువుదీరిన మైలారలింగేశ్వరస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్ 1వ క్రాస్‌లో ఏకుకోటి మైలారలింగేశ్వస్వామి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నూతన విగ్రహాన్ని ఆలయంలో కొలువుదీర్చారు.

మంజునాథస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ట



ధ్వజ స్తంభ ప్రతిష్ట హోమాలు నిర్వహిస్తున్న శ్రీరంగం సరున్మోహన్ తంత్రి

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని మంజునాథస్వామి ఆలయం వద్ద ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహించారు. ప్రముఖ మళయాళ పండితుడు కేరళ బ్రహ్మశ్రీ శ్రీరంగం సరున్మోహన్ తంత్రి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. సోమవారం మహాగణపతి హోమం, మత్యుంజయ, సుదర్శన హోమాలు, ఉదయం 9.30 గంటలకు నవగ్రహ ప్రతిష్ట అనంతరం 11.15 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ట, పూర్ణాహుతి హోమాలు నిర్వహించనున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే పీడీ యాక్టు

సాక్షి ఎఫెక్ట్..



ఇసుక ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ రమణ

డి హీరేహాళ్ (రాయదుర్గం): అనుమతి లేకుండా ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తే ఎంతటి వారైనా సరే.. పీడీయాక్టులు తెరుస్తామని రూరల్ సీఐ వెంకటరమణ హెచ్చరించారు. 'ఆగని ఇసుక, మట్టి అక్రమ రవాణా' శీర్షికన 'సాక్షి' లో ఆదివారం కథనం ప్రచురితమైంది. జిల్లా ఎస్పీ జగదీష్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు సీఐ రంగంలోకి దిగారు. సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక డంప్‌లు, అక్రమ రవాణాకు సహకరిస్తున్న ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు, ఇసుక వ్యాపారులతో స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డితో కలసి సీఐ సమావేశం నిర్వహించారు. సీఐ వెంకటరమణ మాట్లాడుతూ అవసరాలకు మాత్రమే ఇసుక, మట్టి వినియోగించుకోవాలన్నారు. దాని ముసుగులో వ్యాపారం చేయాలని చూస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మూడు ఆపై ఎక్కువ సార్లు పట్టుబడిన వారిని గుర్తించి పీడీ యాక్టులు తెరవాల్సి వస్తుందన్నారు. అవసరమైతే జిల్లా బహిష్కరణ ఉంటుందన్నారు. టిప్పర్ల ద్వారా ఎక్కడైనా ఇసుక, మట్టి నింపినట్లు సమాచారం వస్తే సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామన్నారు. సరిహద్దు ప్రాంతాల్లోనూ ప్రత్యేక నిఘా వేయడంతో పాటు వాహన తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామయ్య, ఇతర పోలీస్‌లు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలో శ్రీకృష్ణ దేవరాయల జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. స్థానిక శ్రీప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో బలిజ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి పాతబస్టాండ్ రాణీఛత్రంలోని కృష్ణ దేవరాయల విగ్రహం వరకు బైక్ ర్యాలీ చేశారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు టి.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి కోదండ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు పూజారి శివప్రసాద్, విజయ్‌కుమార్, పవన్‌కుమార్, విక్రం, సత్యనారాయణ, కృష్ణమూర్తి, రాచేపల్లి శివ, ధనుంజయ, కుమార్, వెంకటస్వామి నాయుడు, ఎర్రిస్వామి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి



ద్రవ జీవామృతంతో విత్తనశుద్ధి చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి నష్టం లేని రాబడి సాధించొచ్చని జిల్లా (ఎన్‌ఎఫ్‌ఏ)న్యాచురల్ ఫార్మింగ్ అసిస్టెంట్ భానుమతి తెలిపారు. ఆదివారం మండలంలోని శ్రీరంగాపురంలో డ్రై సోయింగ్ పద్ధతిలో రైతు భాస్కర్‌కు చెందిన ఎకరం పొలంలో ఆరు రకాల ప్రధాన పంటల విత్తనాలు, 20 రకాల జీవవైవిధ్య పంటలైన ద్విదళ, ఆకుకూరలు కూరగాయల విత్తనాలను జీజామృతంతో శుద్ధి చేసి ఘన జీవామృతంతో పాటు విత్తారు. మరో రైతు జనార్ధన్‌రెడ్డి పొలంలోని నాలుగు ఎకరాల్లో వక్క, మునగ, అరటి పంటలకు, 20 సెంట్లలో సాగు చేసిన ఏటీఎం మోడల్ సాగు పంటలకు ద్రవ జీవామృతం పిచికారీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధికారులు వన్నూరమ్మ, కాశీం, నాగరాజు, లోకేష్, త్రివేణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అర్బన్ సీఐ జయానాయక్

రాయదుర్గంటౌన్: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సీఐ జయానాయక్ హెచ్చరించారు. సైబర్ నేరాలపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఆదివారం రాయదుర్గం పట్టణం, రూరల్ పరిధిలోని గ్రామాల్లో ఆటోలో మైక్ ద్వారా పోలీసులు విస్తృత ప్రచారం చేశారు. సీఐ మాట్లాడుతూ నేరగాళ్ల నుంచి ఫోన్ కాల్స్ వస్తే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాలరాజు పాల్గొన్నారు.

కణేకల్లు: సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ నాగమధు తెలిపారు. ఆదివారం మండలంలోని మాల్యం, సొల్లాపురం, బ్రహ్మసముద్రం తదితర గ్రామాల్లో సైబర్ నేరగాళ్ల మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్‌కాల్ చేసి, లోన్ మంజూరైందని మభ్యపెడితే నమ్మొద్దన్నారు. వారు పంపే యాప్స్‌లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయరాదన్నారు. వీడియో కాల్స్ ద్వారా మీ పిల్లలు నేరాల్లో పట్టుబడ్డారని, డబ్బిస్తే వదిలేస్తామని చెబితే నమ్మరాదన్నారు. డిజిటల్ అరెస్ట్, ఫేక్‌లోన్ యాప్స్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్ ఫ్రాడ్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఏఎస్‌ఐలు ఈశ్వరయ్య, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై పోస్టర్ల విడుదల

గుమ్మఘట్ట: సైబర్‌నేరాలపై అప్రమత్తత అవసరమని ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు. మండలంలోని కలుగోడు, జె.వెంకటంపల్లి, బేలోడు, భూపసముద్రం, ఎర్రంపల్లి,నేత్రపల్లి గ్రామాల్లో సైబర్‌నేరాలపై ఆయా గ్రామాల ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు.

శుభకార్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెట్టు

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న సోదరుడు నాగరాజు కూతురు సాయిప్రియ, సురేష్‌కుమార్ వివాహానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్యలు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆదివారం స్థానిక కేసీఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో సాయిప్రియ, సురేష్‌కుమార్ వివాహం జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు వెన్నపూస రవీంద్రారెడ్డి, పామిడి వీరాంజనేయులు, గొని ఉపేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, జెడ్పీ సభ్యులు డి.పద్మావతి, ఎంపీపీ లీలావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు పైనేటి తిమ్మప్ప చౌదరి, హంపారెడ్డి, డాక్టర్ సోమన్న, హళ్లినాగరాజు, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మరో వెయ్యి ఎకరాల అడవి అగ్గిపాలు



కాలిపోతున్న అటవీ ప్రాంతం

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల అడవి మరో వెయ్యి ఎకరాలు కాలిపోయింది. శనివారం సాయంత్రం పడిన అగ్గి రాజుకుంటూ రెండు రోజులకు పైగా కాలిపోతూనే కనిపించింది. సుమారు 8 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న అటవీప్రాంతం.. ఇప్పటికే 15 వందల ఎకరాలు కాలిపోయింది. 24 గంటల్లో వెయ్యి ఎకరాలు కాలిపోయింది.

జంబుగుంపల అడవికి నిప్పు

జంబుగుంపల అడవికి నిప్పు పడింది. మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తుండగా నల్లప్పగారి హనుమంతరాయుడుకు చెందిన మోటార్ బైక్, విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్, డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షలు నష్టపోయినట్లు బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హనుమంతరాయుడు పొలం ఐదెకరాలు జంబుగుంపల అడవికి ఆనుకొని ఉంది. వేరుశనగ, టమాట పంటలు సాగు చేశాడు. ఆదివారం మధ్యాహ్నం అడవికి నిప్పంటుకుంది. మంటలు పొలానికి వ్యాపిస్తుండగా ఆర్పే ప్రయత్నం చేశాడు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం

రాయదుర్గం: పట్టణంలోని రాయల్ కళాశాలలో 2006–2009 బ్యాచ్ ఎంసీఏ అభ్యసించిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనం తర్వాత చిన్ననాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలను అందజేశారు. అనంతరం భోజనం చేసి, సందడిగా గడిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, పూర్వవిద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బసవేశ్వరస్వామి విగ్రహ పునఃప్రతిష్ట



అలంకరణలో బసవేశ్వరస్వామి

ఉరవకొండ: మండలంలోని ఆమిద్యాల గ్రామంలో వెలసిన పురాతన బసవేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నూతన బసవేశ్వరస్వామి విగ్రహానికి ప్రాణప్రతిష్ట, అభిషేకం, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



పేకాటరాయుళ్ల అరెస్టు చూపుతున్న పోలీసులు

బ్రహ్మసముద్రం: మండలంలోని పాలవెంటాపురం సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఏఎస్‌ఐ నరేంద్రకుమార్ పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం

రాయదుర్గంటౌన్: రాష్ట్రంలో ఇటీవల విద్యార్థినులు, మహిళలపై వేధింపులు, దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నా రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమవుతోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అన్నమయ్య జిల్లాలో గౌతమి అనే మహిళపై యాసిడ్ పోసి, కత్తితో పొడిచిన నిందితుడిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

తప్పిన పెను ప్రమాదం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని మల్లికార్జునపల్లిలో రామూర్తి అనే వ్యక్తి స్నానం చేయడానికి వాటర్ హీటర్ వేసి మర్చిపోయాడు. వాటర్ హీటర్ పక్కనే వైర్లు షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇంట్లో దట్టమైన పొగకమ్ముకోవడంతో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. స్థానికులు వెళ్లి మంటలు అదుపు చేశారు. ఇంట్లోని వస్తువులు, ఇంటి దూలాలు కాలిపోయాయి. సకాలంలో స్థానిక ప్రజలు స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది.

భక్తులతో కిక్కిరిసిన బూదిగుమ్మ క్షేత్రం



ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రధాన అర్చకుడు జ్ఞానేంద్రశాస్త్రి



బూదిగుమ్మ తిరునాలలో పాల్గొన్న భక్తులు

బొమ్మనహాళ్: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం బూదిగుమ్మ రథోత్సవంలో భాగంగా ఆదివారం ఆంజనేయస్వామి తిరునాలకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ సమీపంలోని పెన్నానది, జీడిపల్లి రిజర్వాయర్‌లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. దాతలు బళ్లారి వెన్నపూస వంశస్తులు, రాళ్లపల్లి మనోజ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సిప్లాన్ గ్రూప్ చైర్మన్ కరుట్లపల్లి అనంతయ్య పేరిట అన్నదానం చేశారు. కాగా హేమంత్‌కుమార్ అనే ఓ యువకుడు నదిలో స్నానం చేస్తూ నీటిలో మునిగిపోతుండగా స్థానికులు, పోలీసులు, వైద్య సిబ్బంది సీపీఆర్ చేసి, 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరుషలో ఎస్‌ఐ శివ, ఏఎస్‌ఐ రామదాసు, పోలీసు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెరకు పంట దగ్ధం

బొమ్మనహాళ్: మండలంలోని బండూరు గ్రామం వద్ద విద్యుత్ తీగలు తగిలి చెరకు పంట దగ్ధమైంది. వివరాలు.. బండూరు గ్రామానికి చెందిన తిమ్మప్ప, రాఘవేంద్ర, ఎర్రితాత 16 ఎకరాలు కౌలుకు తీసుకొని చెరకు పంట సాగు చేశారు. ఆదివారం తెల్లవారుజామున కిందనే వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి షార్ట్‌సర్క్యూట్‌తో చెరకు పంట కాలిపోయింది. దీంతో కౌలు రైతులకు రూ.20 లక్షలు నష్టం జరిగింది. అధికారులు పంటను పరిశీలించి తమకు న్యాయం చేయాలని బాధితులు తిమ్మప్ప, రాఘవేంద్ర, ఎర్రితాత కోరుతున్నారు.

వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోండి

వజ్రకరూరు: ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రమావత్‌దేవి, సర్పంచు తిరుపాల్ యాదవ్ తెలిపారు. ఆదివారం జరుట్లరాంపురం కొట్టాలలో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎంపీపీ, సర్పంచు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రారంభించారు. ఉరవకొండ మాజీ మార్కెట్ చైర్మన్ రమణాయాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సామానాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.